జ్వాల తెలుగు న్యూస్

RNI NO: TELTEL/2023/88524

# మెదక్ టుడే

MEDAK TODAY

తెలుగు దిన పత్రిక...

01 ఏప్రిల్ 2026 | మెదక్ | పేజీలు :4 వెల రూ.:2 | ఎడిటర్: సిహెచ్. శివకుమార్ | సంపుటి 02 | సంచిక 121


# పరిశోధన కాదు.... తపస్సు!



**ఓయూలో 'అనంత' పరిశోధనలు**
**పీహెచ్‌డీకి మూడు దశాబ్దాలా?**
**కాగ్ నివేదికలో విస్తుపోయే నిజాలు!**
**ముప్పై ఏళ్ల ప్రస్థానం...**
**డాక్టరేట్ కోసం ఒక జీవితకాలం!**
**గల్లంతైన లక్షన్నర జవాబు పత్రాలు**
**పరీక్షల విభాగంలో అస్తవ్యస్తం**
**నిధుల మళ్లింపు.. అర్హత లేని**
**ప్రొఫెసర్ల నియామకంపై**
**'కాగ్' సీరియస్**

హైదరాబాద్ మార్చి 31: విద్యాకుసుమాలు వికసించాల్సిన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఇప్పుడు వివాదాలకు నిలయంగా మారింది. సోమవారం అసెంబ్లీ వేదికగా బయటపడ్డ కాగ్ నివేదిక, ఓయూలో జరుగుతున్న పరిపాలనా వైఫల్యాలను నగ్నంగా బయటపెట్టింది. అకడమిక్ క్రమశిక్షణ నుంచి నిధుల వినియోగం వరకు ప్రతిచోటా 'లొసుగులే' కనిపిస్తున్నాయి.సాధారణంగా పీహెచ్‌డీ అంటే గరిష్టంగా ఆరేళ్లలో పూర్తి కావాలి. కానీ, ఉస్మానియాలో కొందరు విద్యార్థులకు ఇది ఒక 'జీవితకాల ధ్యానం'లా మారింది. ఏకంగా 26 నుంచి 30 ఏళ్ల పాటు పరిశోధనలు సాగించడంపై ఆడిట్ విస్మయం వ్యక్తం చేసింది. : మొత్తం 2887 మంది స్కాలర్లలో 57 శాతం మంది గడువు దాటినా ఇంకా వర్సిటీలోనే కొనసాగుతున్నారు.తెలంగాణ ఉద్యమం, కోవిడ్ కారణాలను సాకుగా చూపుతున్నా, మూడు దశాబ్దాల కాలయాపనను సమర్థించుకోవడం సాధ్యం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

**మాయమైన లక్షన్నర పేపర్లు!**
పరీక్షల విభాగంలో పారదర్శకత ప్రశ్నార్థకంగా మారింది. సుమారు 1.5 లక్షల అదనపు జవాబు

మిగతా 2లో



# "సంకల్ప" యుద్ధం!

**అక్రమ వలసదారులను సాగనంపుతాం**
**మహిళలకు నెలకు రూ. 3,000**
**2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు ఖాయం.**
**ప్రతి జిల్లాకు ఒక మెడికల్, ఇంజనీరింగ్ కాలేజ్.**
**యూసీసీ అమలు చేస్తాం కానీ.. గిరిజన ప్రాంతాలకు మాత్రం మినహాయింపు!**
**బీజేపీ మేనిఫెస్టో విడుదల**

గుహవటి మార్చి 31: అసోం అసెంబ్లీ ఎన్నికల సమరంలో అధికార బీజేపీ తన అస్త్రాలను సిద్ధం చేసింది. మంగళవారం రాజధాని గుహవటిలో ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సమక్షంలో 'సంకల్ప పాత్ర' పేరుతో ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేశారు. రాష్ట్ర అస్తిత్వాన్ని కాపాడటంతో పాటు, భారీ అభివృద్ధి లక్ష్యాలతో ఈ మేనిఫెస్టోను రూపొందించారు.

**అస్తిత్వ పోరాటం: అక్రమ వలసలు, యూసీసీపై హామీలు**
బీజేపీ తన మేనిఫెస్టోలో ప్రధానంగా రాష్ట్ర జనాభా సమతుల్యత మరియు సాంస్కృతిక రక్షణకు ప్రాధాన్యత ఇచ్చింది 1950 చట్టం ప్రకారం బంగ్లాదేశీ అక్రమ వలసదారులను రాష్ట్రం నుంచి పంపిస్తామని సీఎం హామీ ఇచ్చారు. అక్రమంగా వచ్చిన వారిని 24 గంటల్లోనే గుర్తించి పంపించేలా చర్యలు తీసుకుంటామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యూసీసీ అమలు చేస్తామని, అయితే గిరిజన ప్రాంతాలకు (ఆరో షెడ్యూల్) మినహాయింపు ఉంటుందని స్పష్టం చేశారు.లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌లను అడ్డుకోవడానికి కఠిన చట్టాలు తెస్తామని ప్రకటించారు.

**అభివృద్ధి పంథా: రూ. 5 లక్షల కోట్ల మౌలిక వసతులు**
రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు

మిగతా 2లో


## దళపతి విజయ్‌కు ఈసీ "రెడ్ కార్డ్"

**తొలి ఎన్నికల్లోనే కేసుల సెగ!**
**5,000 మందిపై కార్యకర్తలపై ఎఫ్ఐఆర్!**
**ఆస్తులు 600 కోట్లు..**
**క్రేజ్ అంతకు మించి..**
**నిబంధనల దగ్గరే 'టీవీకే' బాస్‌కు బ్రేక్**



2

తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్‌పై చెన్నైలోని పెరావల్లూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల నియమావళి) ఉల్లంఘించారన్నది ప్రధాన ఆరోపణ. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు.



## 'లష్కరే' డెత్ ప్లాన్ భగ్నం

**దేవాలయాలు, మార్కెట్లే టార్గెట్..**
**షబ్బీర్ అరెస్ట్‌తో వెలుగులోకి షాకింగ్ నిజాలు!**
**టెలిగ్రామ్ చాట్స్.. నిఘా నీడన గుళ్లు..**

2

# హైదరాబాద్‌కు 'బుల్లెట్' వేగం

**మూడు మెట్రో నగరాలకు హైస్పీడ్ కారిడార్లు!**
**భారత్ ఫ్యూచర్‌సిటీలో 500 ఎకరాల కేటాయింపు..**
**అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెల్లడి**



హైదరాబాద్ మార్చి 31: తెలంగాణ రవాణా ముఖచిత్రాన్ని మార్చేసే భారీ ప్రాజెక్టులకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. దేశ రాజధాని తరహాలో భాగ్యనగరాన్ని అంతర్జాతీయ స్థాయి రవాణా కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అడుగులు వేస్తున్నాయి. గంటకు 350 కి.మీ వేగంతో దూసుకెళ్లే బుల్లెట్ రైళ్ల కోసం హైదరాబాద్ నుంచి మూడు ప్రధాన కారిడార్లను కేంద్రం ఖరారు చేయగా, వీటికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం కీలక అప్డేట్ ఇచ్చింది.

ముడు కారిడార్లు.. మూడు గంటల్లో ప్రయాణం!
కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించిన ఏడు హైస్పీడ్ కారిడార్లలో తెలంగాణకు మూడు దక్కడం విశేషం. ఈ ప్రాజెక్టుల ద్వారా పొరుగు రాష్ట్రాల రాజధానులకు ప్రయాణ సమయం ఊహించని రీతిలో తగ్గనుంది.
కారిడార్లు: హైదరాబాద్ - బెంగళూరు, హైదరాబాద్ - పుణె, హైదరాబాద్ - చెన్నై.
సమయం ఆదా: ప్రస్తుతం 12 నుండి 15 గంటలు పట్టే ప్రయాణం

మిగతా 2లో



# ప్రకృతి పగబట్టిందా?

**'నింగి'కి చిల్లు.. అన్నదాతకు కన్నీటి జల్లు**
**ఒక్క రాత్రిలోనే 'ఆగం' చేసిన అకాల వర్షం**
**మృత్యుపాశమైన ఈదురుగాలులు**
**నేలమట్టమైన ఆకుపచ్చని ఆశలు**
**పది నెలల కష్టం నీటి పాలు**
**తడిసిన పసుపు, నేలపాలైన మామిడి**
**పెట్టుబడి 'మట్టి'లో.. బతుకు 'తడి'లో**
**సర్కారు సాయం కోసం అన్నదాతల ఆక్రందన**

సెంట్రల్ డెస్క్ మార్చి 31: న్నటి వరకు చేతికొచ్చిన పంటను చూసి మురిసిపోయిన రైతు కళ్లల్లో, నేడు కన్నీటి సుడులు తిరుగుతున్నాయి. ఒక్కటంటే ఒక్క రాత్రి.. ఆకాశం నుంచి కురిసిన అకాల వర్షం, అండగా ఉండాల్సిన ఈదురుగాలులు కలిసి తెలంగాణ పల్లెలను శ్మశాన నిశ్శబ్దంలోకి నెట్టేశాయి. గాలివాన బీభత్సానికి వరి వంగిపోయింది, మొక్కజొన్న కుప్పకూలింది, బంగారు కాంతిలీనాల్సిన పసుపు బురదలో కూరుకుపోయింది.

**పసుపు రైతు.. కన్నీటి పర్వం:**
నిర్మల్, నిజామాబాద్ జిల్లాల్లోని పసుపు రైతుల పరిస్థితి వర్ణనాతీతం. తొమ్మిది నెలలు బిడ్డలా సాకి, ఉడకబెట్టి, ఆరబోసి.. రేపో మాపో మార్కెట్‌కు వెళ్దామనుకున్న తరుణంలో వాన దేవుడు కరుణించలేదు. "పసుపు కొమ్ములు

మిగతా 2లో

# 'ప్రాణదాత'కు అండగా ప్రభుత్వం

**ట్యాంక్‌బండ్ శివకు రూ. 5 లక్షల సాయం, కుమారుడికి సర్కారీ కొలువు**
**మానవత్వంతో స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి**
**అండగా నిలిచిన అభయహస్తం**
**వందలాది ప్రాణాలు కాపాడిన సాహసికి గూడు, ఉపాధి హామీ**
**ట్యాంక్‌బండ్ శివ కుమారుడికి హోం గార్డు నియామక పత్రం అందజేత**



2

హుస్సేన్ సాగర్ అలల సాక్షిగా ఎన్నో నిండు ప్రాణాలను కాపాడిన 'సాహస శిఖరం' ట్యాంక్‌బండ్ శివకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రాణాలకు తెగించి ఇతరులను కాపాడే శివ, తన కుటుంబ పోషణ కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
బుధవారం 01-04-2026

## హైదరాబాద్‌కు 'బుల్లెట్' వేగం

ఇకపై కేవలం 3 నుండి 3.5 గంటల్లోనే పూర్తికానుంది.
సాంకేతికత: వందే భారత్ (180 కి.మీ) కంటే రెట్టింపు వేగంతో, ప్రత్యేకంగా నిర్మించే ట్రాక్‌లపై ఈ బుల్లెట్ రైళ్లు నడవనున్నాయి.
ఫ్యూచర్‌సిటీలో బుల్లెట్ ట్రైన్ హబ్
ఈ మెగా ప్రాజెక్టు కోసం శంషాబాద్ సమీపంలోని 'భారత్ ఫ్యూచర్‌సిటీ' పరిధిలో 500 ఎకరాల భూమిని కేటాయించనున్నట్లు రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అసెంబ్లీలో ప్రకటించారు. ఈ భూమిలో బుల్లెట్ రైళ్లకు సంబంధించిన స్టేషన్లు, మెయింటెనెన్స్ డిపోలు మరియు ఇతర మౌలిక సదుపాయాలు ఏర్పాటు కానున్నాయి.
తెలుగు రాష్ట్రాల మధ్య 'గంట' ప్రయాణం!
బుల్లెట్ రైళ్లు కేవలం మెట్రో నగరాలకే పరిమితం కాకుండా, తెలుగు రాష్ట్రాల్లోని కీలక పట్టణాలను అనుసంధానించనున్నాయి.
ఖమ్మం, కర్నూలు: కేవలం 60 నిమిషాల్లో చేరుకోవచ్చు.
అమరావతి: ఏపీ రాజధానికి 75 నిమిషాల ప్రయాణ సమయం.
అనంతపురం: కేవలం గంటన్నర (90 నిమిషాలు) లోనే చేరుకునే వెసులుబాటు.
స్టాపేజీలు: సూర్యాపేట, మహబూబ్‌నగర్, వనపర్తి, నార్కట్‌పల్లి, కావలి, చీరాల వంటి పట్టణాల్లో కూడా స్టాపేజీలు ఇచ్చేలా డిజైన్ చేస్తున్నారు.
రూ. 70 వేల కోట్లతో రహదారుల నెట్‌వర్క్
రాష్ట్రవ్యాప్తంగా రోడ్ల అభివృద్ధిపై మంత్రి కోమటిరెడ్డి భారీ లక్ష్యాన్ని నిర్దేశించారు 2028 డిసెంబరు నాటికి తెలంగాణ రోడ్లను దేశంలోనే అత్యుత్తమంగా తీర్చిదిద్దడం.
హైదరాబాద్ - విజయవాడ: ఈ బిజీ రహదారిని 6 లేన్ల ఎక్స్‌ప్రెస్‌వేగా విస్తరించనున్నారు.
ఎలివేటెడ్ కారిడార్: శ్రీశైలం వెళ్లే మార్గంలో మన్ననూరు వద్ద 53 కి.మీ. పొడవైన భారీ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం.
గ్రీన్‌ఫీల్డ్ హైవే: ఫ్యూచర్‌సిటీ - అమరావతి - బందర్‌పోర్టులను కలిపే సరికొత్త రహదారి నిర్మాణం.
"ఈ ప్రాజెక్టులు పూర్తయితే తెలంగాణ కేవలం దక్షిణ భారతానికే కాదు.. దేశానికే ఆర్థిక మరియు రవాణా ఇంజిన్‌గా మారుతుంది. సామాన్యుడి ప్రయాణం వేగవంతం కావడమే మా ప్రభుత్వ లక్ష్యం."గ--- కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఆర్అండ్‌బీ మంత్రి

## లష్కరే డెత్ ప్లాన్ భగ్నం

**ఢిల్లీ మార్చి 31:** పాకిస్తాన్‌కు చెందిన భయంకర ఉగ్రవాద సంస్థ లష్కరే-తొయిబా పాక్ నిఘా సంస్థ లతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న షబ్బీర్ అహ్మద్‌ను ఢిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఇతడు కేవలం ఒక ఉగ్రవాది మాత్రమే కాదు, దేశ రాజధానిలో ఉగ్రవాద నెట్‌వర్క్‌ను విస్తరిస్తున్న "మాస్టర్ మైండ్".

**ఉగ్రవాదుల 'హిట్ లిస్ట్'లో ఉన్న ప్రాంతాలు:**
షబ్బీర్ అహ్మద్ తన మొబైల్ ద్వారా నిఘా పెట్టి, వీడియోలు తీసి పాక్ హ్యాండ్లర్లకు పంపిన కీలక ప్రాంతాలు ఇవే కల్కాజీ టెంపుల్, ఛతర్‌పూర్ టెంపుల్, లోటస్ టెంపుల్. కొన్నాట్ ప్లేస్ (జూ), పహర్‌గంజ్ వంటి రద్దీగా ఉండే వ్యాపార ప్రాంతాలు. వేలాది మంది ప్రాణాలు తీయడం ద్వారా దేశంలో అలజడి సృష్టించడం.

**ఇన్వెస్టిగేషన్‌లో తేలిన సంచలన విషయాలు:**
బంగ్లాదేశ్ కేంద్రంగా ఒక కొత్త ఉగ్రవాద సంస్థను స్థాపించేందుకు షబ్బీర్ ప్రయత్నిస్తున్నాడు. ఢిల్లీ, ప్రాంతాల్లోని యువతను ఉగ్రవాదం వైపు ఆకర్షించి, వారిని 'స్లీపర్ సెల్స్'గా మార్చడమే ఇతని పని. భారత నిఘా సంస్థల కళ్లు గప్పేందుకు ఇతడు కేవలం టెలిగ్రామ్ వంటి ఎన్‌క్రిప్టెడ్ యాప్స్ ద్వారానే కమ్యూనికేట్ చేసేవాడు. జమ్మూ కాశ్మీర్‌లో పుట్టుకొచ్చిన తరహాలోనే ఢిల్లీలో కూడా ఒక స్థానిక ఉగ్రవాద ముఖాన్ని సృష్టించాలని ప్లాన్ చేశారు.సమయానికి ఢిల్లీ పోలీసులు షబ్బీర్‌ను పట్టుకోకపోతే, రాజధాని నగరం మరోసారి నెత్తురోడేది. ఇతడి అరెస్ట్‌తో దేశవ్యాప్తంగా ఉన్న ఉగ్రవాద నెట్‌వర్క్‌ల గుట్టు రట్టవుతోంది.దేశ భద్రతా సంస్థలు అప్రమత్తంగా ఉన్నప్పటికీ, ప్రజలు కూడా తమ చుట్టుపక్కల అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

## "సంకల్ప" యుద్ధం!

భారీ కేటాయింపులు చేశారుఅసోంను వరదల రహిత రాష్ట్రంగా మార్చేందుకు రూ. 18,000 కోట్లు కేటాయిస్తారు. రోడ్లు, రైల్వేలు, విమానయాన రంగాల అభివృద్ధికి రూ. 5 లక్షల కోట్లు పెట్టుబడి పెట్టనున్నారు.
'వన్ డిస్ట్రిక్ట్ - వన్ ఇనిస్టిట్యూషన్' కింద ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్, ఒక ఇంజనీరింగ్ కాలేజ్ మరియు ఒక యూనివర్సిటీని ఏర్పాటు చేస్తారు.

**సంక్షేమ పథకాలు: మహిళలకు, నిరుద్యోగులకు వరం**
రాబోయే ఐదేళ్లలో 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. మహిళలకు అందించే ఆర్థిక సాయాన్ని రూ. 1,250 నుంచి రూ. 3,000కు పెంపు. 'ముఖ్యమంత్రి మహిళా ఉద్యమిత' పథకం కింద అర్హులైన మహిళలకు రూ. 25,000 ఆర్థిక సాయం. రాష్ట్రంలోని తేయాకు తోటల కార్మికుల రోజువారీ వేతనాన్ని రూ. 500కు పెంచుతామని హామీ ఇచ్చారు.

## ప్రకృతి పగబట్టిందా?

కాదు.. అవి మా గుండెకాయలు. ఇప్పుడు తడిసిపోయాయి, రంగు మారుతాయి.. ఏ వ్యాపారి మా దగ్గరకు వస్తాడు? ఏ ప్రభుత్వం మమ్మల్ని ఆదుకుంటుంది?" అని నిర్మల్ రైతు బాధితుడు ప్రశ్నిస్తున్న తీరు గుండెలను పిండేస్తోంది.

**ఎటుచూసినా నష్టమే..**
**సిద్దిపేట**: హుస్నాబాద్ యార్డులో రైతులు కుప్పలు పోసిన మక్కలు తడిసి ముద్దయ్యాయి.
**మంచిర్యాల:** ఇటిక్యాల లాంటి గ్రామాల్లో 20 ఎకరాల్లో మొక్కజొన్న పూర్తిగా నేలకొరిగింది. పాలు పోసుకునే దశలో ఉన్న పంట నాశనం కావడంతో రైతులకు రూపాయి కూడా దక్కేలా లేదు.
**నిజామాబాద్:** ధర్పల్లి, సిరికొండ మండలాల్లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద నీటి ప్రవాహం రైతుల ఆశలను కొట్టుకుపోయేలా చేసింది.
"నోటికాడికి వచ్చిన కూడు.. నేలపాలైంది". ఇప్పుడు అన్నదాతకు కావాల్సింది కేవలం ఓదార్పు కాదు, కచ్చితమైన భరోసా. తడిసిన ప్రతి గింజా కొంటామని, నష్టపోయిన ప్రతి ఎకరాకు పరిహారం ఇస్తామని ప్రభుత్వం ప్రకటించకపోతే.. పల్లెల్లో విషాద ఛాయలు మరింత ముదురుతాయి.

## పరిశోధన కాదు...తపస్సు

పత్రాలు స్టాక్ రిజిస్టర్‌లో నమోదు కాలేదు."లక్షన్నర పేపర్లు లెక్కల్లో లేకపోవడం అంటే, అవి పరీక్షల్లో అక్రమాలకు లేదా సప్లిమెంటరీ పరీక్షల్లో దుర్వినియోగానికి దారితీసే ప్రమాదం ఉంది." - అని కాగ్ హెచ్చరించింది. వీటి విలువ రూ. 10.60 లక్షలుగా తేలింది.

**నిధుల దారి మళ్లింపు.. అభివృద్ధికి గండి**
ఒకవైపు నిధుల కొరతతో వర్సిటీ కొట్టుమిట్టాడుతుంటే, మరోవైపు ఉన్న నిధులను ఖర్చు చేయడంలో ఘోరంగా విఫలమైంది.రూ. 18.78 కోట్ల అభివృద్ధి నిధులు ఖర్చు చేయకుండానే వెనక్కి వెళ్ళిపోయాయి. శతాబ్ది ఉత్సవాల కోసం కేటాయించిన నిధులను నిబంధనలకు విరుద్ధంగా ఇతర అవసరాలకు మళ్లించడం అధికారుల నిర్లక్ష్యాన్ని సూచిస్తోంది.

**అర్హత లేని కొలువులు - కిక్కిరిసిన హాస్టళ్లు:** నిర్వహణ లోపాలు కేవలం నిధులకు మాత్రమే పరిమితం కాలేదు. కనీస అర్హతలు లేని 82 మందిని ప్రొఫెసర్లుగా నియమించడం ద్వారా విద్యా ప్రమాణాలను తుంగలో తొక్కారు. ఇక విద్యార్థుల వసతి విషయానికి వస్తే, 10 హాస్టళ్లు వాటి సామర్థ్యం కంటే 300 శాతం అదనపు ఆక్యుపెన్సీతో నరకాన్ని తలపిస్తున్నాయి.విశ్వవిద్యాలయ గౌరవ ప్రతిష్టలు మసకబారుతున్న తరుణంలో, ఈ కాగ్ నివేదిక ఒక హెచ్చరిక లాంటిది. చారిత్రక వారసత్వం ఉన్న ఓయూను మళ్లీ పూర్వవైభవానికి తీసుకురావాలంటే, ఇప్పటికైనా ప్రభుత్వం మరియు వర్సిటీ యాజమాన్యం ప్రక్షాళన దిశగా అడుగులు వేయాల్సి ఉంది.

## దళపతి విజయ్‌కు ఈసీ "రెడ్ కార్డ్":

**తమిళనాడు మార్చి 31:** తమిళగ వెట్రి కళగం అధినేత, నటుడు విజయ్‌పై చెన్నైలోని పెరావల్లూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎన్నికల నియమావళి) ఉల్లంఘించారన్నది ప్రధాన ఆరోపణ. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆఫీసర్ కుమార్ ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు రంగంలోకి దిగారు.

**విజయ్‌పై ఉన్న 5 ఆరోపణలు ఇవే:**
లౌడ్ స్పీకర్ల మోత: అనుమతి లేకుండానే సభలో ఏకంగా 30 లౌడ్ స్పీకర్లు వాడటం.
**జనసందోహం:** పరిమితికి మించి (5,000 మందికి పైగా) జనాన్ని తరలించి ప్రజలకు అసౌకర్యం కలిగించడం.
**ట్రాఫిక్ జామ్:** రోడ్లను బ్లాక్ చేసి సామాన్యుల రాకపోకలకు అడ్డుపడటం.
**అంబులెన్స్‌కు నో వే:** అత్యవసర సేవలకు (అంబులెన్స్) దారి ఇవ్వకుండా నిర్లక్ష్యం వహించడం.
**భద్రతా లోపాలు:** జనం రద్దీ వల్ల ప్రజా భద్రతకు ముప్పు వాటిల్లేలా వ్యవహరించడం.

**5,000 మందిపై ఎఫ్ఐఆర్!**
కేవలం విజయ్ మాత్రమే కాదు, ఆ సభకు హాజరైన దాదాపు 5,000 మంది పార్టీ కార్యకర్తలను కూడా ఎఫ్ఐఆర్‌లో చేర్చడం తమిళ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఏప్రిల్ 23న జరగనున్న పోలింగ్‌కు ముందు ఇది టీవీకే పార్టీకి పెద్ద షాక్ అనే చెప్పాలి. తొలి ఎన్నికల్లోనే ఇన్ని సవాళ్లు ఎదురవ్వడం విజయ్ రాజకీయ ప్రస్థానానికి ఒక పరీక్ష వంటిది. ఏప్రిల్ 23న తమిళ ఓటరు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాలి!

## 'ప్రాణదాత'కు అండగా ప్రభుత్వం

**హైదరాబాద్ మార్చి 31:** హుస్సేన్ సాగర్ అలల సాక్షిగా ఎన్నో నిండు ప్రాణాలను కాపాడిన 'సాహస శిఖరం' ట్యాంక్‌బండ్ శివకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలిచింది. ప్రాణాలకు తెగించి ఇతరులను కాపాడే శివ, తన కుటుంబ పోషణ కోసం ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి తక్షణమే స్పందించారు. మానవత్వంతో స్పందించి, శివ కుటుంబానికి ఉజ్వల భవిష్యత్తును అందిస్తూ పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.

**అందించిన ఆర్థిక సాయం మరియు ఉద్యోగం:**ముఖ్యమంత్రిని కలిసిన శివ కుటుంబ సభ్యులకు సీఎం స్వయంగా రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. కేవలం నగదు సాయానికే పరిమితం కాకుండా, శివ సేవలను గుర్తిస్తూ అతని కుమారుడు వేణుమాధవ్‌కు హోం గార్డు ఉద్యోగం కల్పించారు. దీనికి సంబంధించిన నియామక పత్రాన్ని సీఎం చేతుల మీదుగా వేణుమాధవ్ అందుకున్నారు.

**ఉపాధి మరియు నివాస వసతి:**శివ జీవనోపాధి కోసం ట్యాంక్‌బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని శివ కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే, నిలువ నీడ లేని ఆ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు.

**కృతజ్ఞతలు తెలిపిన శివ కుటుంబం:** ఈ సందర్భంగా శివ కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. "మేము ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి దేవుడిలా ఆదుకున్నారు. మా శ్రమను గుర్తించి, స్వయంగా పిలిచి సాయం అందించడం మా జీవితంలో మర్చిపోలేము" అని ఉద్వేగానికి లోనయ్యారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం సామాజిక సేవ చేసే ప్రతి ఒక్కరికీ కొండంత అండగా నిలుస్తుందని, ప్రాణాలను కాపాడే శివ లాంటి సామాన్య వీరులకు ఇది సరైన గౌరవమని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# షాద్ నగర్ చౌరస్తా విస్తరణకు రంగం సిద్ధం

### షాద్ నగర్ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ చౌరస్తా ప్రాంగణాన్ని పరిశీలించిన హెచ్ఎండిఏ ఏఈ విశ్వతేజ.

**(స్పెషల్ కరస్పాండెంట్) షాద్ నగర్,మార్చి,31,మెదక్ టుడే న్యూస్**
ఎంతోకాలంగా షాద్ నగర్ పట్టణ ప్రజలు ఎదురుచూస్తున్న చౌరస్తా విస్తరణ కార్యక్రమం త్వరలోనే ప్రారంభం కానుందని మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ తెలిపారు.మంగళవారం పట్టణంలోని ప్రధాన చౌరస్తాను హెచ్ఎండిఏ ( హెచ్ఎండిఏ) శాఖకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్ విశ్వతేజ సందర్శించి ప్రాంగణాన్ని పరిశీలించారు. విస్తరణ పనుల్లో భాగంగా పరిసర ప్రాంతాల పరిస్థితులను సమీక్షించారు.ఈ సందర్భంగా చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌తో పాటు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, కౌన్సిలర్లు మురళీమోహన్ అప్పి, పెంటయ్య, కళ్యాణ్, దిలీప్, అలాగే నాయకులు ముబారక్ అలీ ఖాన్, సాదిక్, వీర్లపల్లి మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.చౌరస్తా విస్తరణ పనులు అన్ని అవసరాలకు అనుగుణంగా, ప్రజల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్నట్లు చైర్మన్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కృషితో పట్టణ అభివృద్ధికి ప్రజలు, వ్యాపారులు పూర్తి సహకారం అందిస్తున్నారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.
త్వరలోనే పనులు ప్రారంభమవడంతో ట్రాఫిక్ సమస్యలు తగ్గి, పట్టణ రవాణా సౌకర్యాలు మెరుగుపడనున్నాయని స్థానికులు భావిస్తున్నారు.




# సొంత ఇంటి కల సాకారంకౌన్సిలర్ ఎస్పీ శివ

### నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీ 26వ వార్డులో ముగ్గురికి ఇళ్ల పట్టాలు అందజేత.

**(స్పెషల్ కరస్పాండెంట్)షాద్ నగర్,మార్చి,31,మెదక్ టుడే న్యూస్**
పేద ప్రజలు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సొంత ఇంటి కల నెరవేరిందని 26వ వార్డు కౌన్సిలర్ ఎస్పీ శివ తెలిపారు. మంగళవారం తన వార్డులో ముగ్గురు లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను పంపిణీ చేసినట్లు వెల్లడించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు ఇళ్లకు సంబంధించిన పట్టాలను అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న గృహ పథకాలు నిజంగా పేదల జీవితాల్లో మార్పు తీసుకువస్తున్నాయని ఎస్పీ శివ అన్నారు.లబ్ధిదారుల వివరాలను మీడియాకు వెల్లడించిన ఆయన, ఎనుముల మల్లిక, గంగిశెట్టి పార్వతమ్మ, మినుగుల అభిలాష్‌కు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను అందజేసినట్లు తెలిపారు.ఇళ్ల పంపిణీతో లబ్ధిదారుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయని, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వారు పేర్కొన్నారు.



# హనుమాన్ జయంతి సందర్భంగా పటిష్ట పోలీసు బందోబస్తు

### ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు ఐపీఎస్

**మెదక్,మార్చి,31,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి**
హనుమాన్ జయంతి సందర్భంగా జిల్లాలో పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు తెలిపారు. పండుగను ప్రశాంతంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలోని హనుమాన్ దేవాలయాలు, ఊరేగింపు మార్గాలు, రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బలగాలను మోహరించినట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందన్నారు.వదంతులను నమ్మకుండా అప్రమత్తంగా ఉండాలని భక్తులకు సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.తప్పుడు ప్రచారాలు, ఇతరులను కించపరిచే ప్రవర్తన, అనవసర గొడవలకు పాల్పడితే సంబంధితులపై నాన్-బైలబుల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో బాధ్యతగా వ్యవహరించాలని, అసత్య సమాచారాన్ని వ్యాప్తి చేయరాదన్నారు. జిల్లా ప్రజలు, నిర్వాహకులు పోలీసులకు సహకరించి పండుగను శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని ఎస్పీ కోరారు.



మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
బుధవారం 01-04-2026

# కొండూర్ పిహెచ్‌సీలో సంచలన స్కాం

## "జీతం తండ్రికి... విధులు కుమారుడికి!"

**(స్పెషల్ కరస్పాండెంట్)కొండూర్,మార్చి,31,మెదక్ టుడే న్యూస్:** ప్రభుత్వ సేవా నియమావళికి విరుద్ధంగా, కొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్ సి )లో పరిపాలనా అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వెలువడుతున్నాయి. ప్రజలకు సేవ చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగి విధులకు గైర్హాజరై, అతని కుమారుడు అధికారిక పనులను నిర్వహిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది.

**ప్రాక్సీ పాలన బహిర్గతం**

వివరాల ప్రకారం, రెవెన్యూ శాఖ (వీఆర్ఓ కేడర్) నుండి ఇటీవల బదిలీపై కొండూర్ పిహెచ్‌సీలో జీడీ కంప్యూటర్ ఆపరేటర్‌గా నియమితుడైన కిష్టయ్య తన విధులకు హాజరుకావడం లేదని సమాచారం. ఆయన స్థానంలో ఎటువంటి అధికారిక నియామకం లేని ఆయన కుమారుడు శివ అన్ని ప్రభుత్వ పనులను నిర్వహిస్తున్నాడు.శివ ప్రభుత్వ కంప్యూటర్లు వినియోగించడం, అధికారిక రికార్డులు యాక్సెస్ చేయడం, రోజువారీ పరిపాలనా పనులను నిర్వహించడం వంటి కార్యకలాపాలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

**వై వైద్యాధికారి వివాదాస్పద సమర్థనం...**

ఈ స్పష్టమైన నియమాల ఉల్లంఘనపై ప్రశ్నించగా, పిహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ ఆశ్చర్యకరమైన సమాధానం ఇచ్చినట్లు సమాచారం."కిష్టయ్యకు కంప్యూటర్ పరిజ్ఞానం లేకపోవడం, మాకు ఆపరేటర్ అత్యవసరంగా అవసరం ఉండటంతో ఆయన కుమారుడిని పని చేయనిస్తున్నాం" అని ఆయన పేర్కొన్నట్లు తెలుస్తోంది.ఈ వ్యాఖ్యలు తీవ్ర విమర్శలకు దారితీశాయి. బాధ్యత గల అధికారి ఇలాంటి అక్రమాన్ని సమర్థించడం పరిపాలనా వ్యవస్థపై అనుమానాలు కలిగిస్తోంది.

**తీవ్ర ఉల్లంఘనలు -- ప్రమాదాలు**

ఈ ఘటన పలు చట్టపరమైన, నైతిక సమస్యలను లేవనెత్తుతోంది:

డేటా భద్రతకు ముప్పు: అనధికారిక వ్యక్తి ప్రభుత్వ మరియు రోగుల సున్నితమైన సమాచారాన్ని యాక్సెస్ చేయడం తీవ్రమైన భద్రతా లోపం.

బయోమెట్రిక్ మోసం: బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి అయినప్పటికీ, కిష్టయ్య హాజరుగా ఎలా నమోదు అవుతున్నాడు? ఇది రికార్డుల మార్పిడి సూచిస్తోంది.బాధ్యత లోపం: ఎలాంటి సాంకేతిక లోపం లేదా ఆర్థిక అక్రమం జరిగినా, కుమారుడిపై చర్యలు తీసుకోవడం సాధ్యం కాదు, ఎందుకంటే అతను ప్రభుత్వ ఉద్యోగి కాదు.

**ప్రజల్లో ఆగ్రహం -- చర్యల కోసం డిమాండ్**

ఈ ఘటనపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు."ప్రభుత్వ కార్యాలయం ఒక కుటుంబ వ్యాపారంలా నడుస్తుందా? మేము చెల్లించే పన్నులు అర్హత కలిగిన ఉద్యోగుల కోసం, ప్రాక్సీల కోసం కాదు" అని ఒక స్థానికుడు ఆవేదన వ్యక్తం చేశాడు.ఉన్నతాధికారుల మౌనం ప్రజల్లో మరింత అసంతృప్తిని కలిగిస్తోంది. జిల్లా వైద్య ఆరోగ్య అధికారి ( డి ఎం హెచ్ ఓ), జిల్లా కలెక్టర్ తక్షణమే జోక్యం చేసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**తక్షణ విచారణకు పిలుపు**

ఈ నేపథ్యంలో ప్రజలు కోరుతున్న చర్యలు:

పిహెచ్‌సీ కార్యకలాపాలపై సమగ్ర విచారణవిధుల పట్ల నిర్లక్ష్యం చూపిన మెడికల్ ఆఫీసర్‌పై కఠిన చర్యలుఅనధికారిక గైర్హాజరు, పదవి దుర్వినియోగంపై కిష్టయ్యపై శాఖాపరమైన చర్యలు తక్షణ చర్యలు తీసుకోకపోతే, ఇటువంటి ఘటనలు ప్రభుత్వ ఆరోగ్య వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని దెబ్బతీసే ప్రమాదం ఉందని ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.






# జిల్లా వ్యాప్తంగా అమలులో 30, 30(ఎ) యాక్ట్

## జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాస రావు

**మెదక్,మార్చ్,31,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి**ఈ సమయంలో పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేకుండా ఏవిధమైన



ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించడం నిషేధమని జిల్లా ఎస్పీ తెలిపారు.అలాగే ప్రజలప్రభుత్వ ఆస్తులకు నష్టం కలిగించే చట్టవ్యతిరేక చర్యలు, అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతల నిర్వహణలో ఎవరైనా విఘాతం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులు చేపడుతున్న చర్యలకు సహకరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకువెళ్లాలి.

ప్రజా ప్రతినిధులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరు కావాలి

గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలి.

జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్



**మెదక్,మార్చి,31,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి**99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2వ తేదీన అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలు నిర్వహించేందుకు సమగ్ర ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు.గ్రామ సభలను సమర్థవంతంగా నిర్వహించి, ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పురోగతిని, రైతు భరోసా, రైతు బీమా, రైతు రుణమాఫీ, సాయిల్ హెల్త్ కార్డ్, వ్యవసాయ తదితర ప్రభుత్వ పథకాల గురించి, ప్రజలకు వివరించాలని అన్నారు.గ్రామసభల్లో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాలని అధికారులకు సూచించారు.

గ్రామ సభలు నిర్వహణకు ముందస్తుగానే షెడ్యూల్ తయారు చేసి పంచాయతి కార్యదర్శులకు సమాచారం ఇవ్వాలని స్పష్టం చేశారు. నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలు నిర్వహణతో పాటు గ్రామంలో ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందిన లబ్ధిదారుల జాభితా చదివి వినిపించాలని ఆదేశించారు. ప్రతి గ్రామ పంచాయతీలో జరిగే సభకు అగ్రికల్చర్, ఎడ్యుకేషన్, హౌసింగ్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులు, తహశీల్దార్, ఎంపి డి ఓ లు తప్పనిసరిగా గ్రామ సభలకు హాజరు కావాలని స్పష్టం చేశారు. గ్రామ సభకు వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా టెంట్లు, కుర్చీలు, తాగునీరు ఇతర మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు.ప్రభుత్వ పథకాలకు దరఖాస్తు చేసుకునే వారి కోసం గ్రామ సభలో ప్రత్యేకంగా దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని ఏర్పాటు చేసి వారి నుంచి దరఖాస్తులను స్వీకరించాలని మంగళ వారం ఒక ప్రకటన తెలిపారు.

# జంగారాయిలో ఎస్పీ పరామర్శ -- 48 గంటల్లో దోపిడీ కేసు ఛేదన

## బాధితులకు భరోసా ఇచ్చిన ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు

**మెదక్,మార్చి,31,మెదక్ టుడే న్యూస్:ప్రతినిధి**జంగారాయి గ్రామంలో వృద్ధ దంపతులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ పరామర్శించారు. ఇటీవల జిల్లాలో సంచలనం సృష్టించిన దోపిడీ కేసును పోలీసులు కేవలం 48 గంటల్లోనే ఛేదించారు. కేసు దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిందితుడిని వేగంగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి బంగారాన్ని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించారు.బాధితులు సావిత్రి, అంజయ్యలను ఎస్పీ పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ ఘటనతో కలిగిన భయాందోళనలను తొలగిస్తూ, పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. నిందితుడికి చట్టపరంగా కఠిన శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరుగుతుందని భరోసా ఇచ్చారు.ఇదిలా ఉండగా, కేసు ఛేదనలో కీలక పాత్ర పోషించిన పోలీసుల పనితీరుపై జంగరాయి గ్రామ ప్రజలు ప్రశంసలు కురిపించారు. జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలు అందించిన సమాచారంతోనే నిందితుడిని త్వరగా గుర్తించి పట్టుకోవడం సాధ్యమైందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్లూస్ అందించిన గ్రామస్థులను ఎస్పీ శాలువాలతో సన్మానించారు. ప్రజలు--పోలీసులు సమన్వయంతో పనిచేస్తే నేరాలను సమర్థవంతంగా అరికట్టవచ్చని ఆయన తెలిపారు. ప్రజల సహకారం లేకుండా నేరాల నియంత్రణ సాధ్యం కాదని అన్నారు.అదేవిధంగా గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు అవసరమని ఎస్పీ సూచించారు. సీసీ కెమెరాలు నేరాల నియంత్రణలో కీలక పాత్ర పోషిస్తాయని, ప్రతి గ్రామంలో భద్రతా చర్యలను బలోపేతం చేయాలని చెప్పారు.అనుమానితుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.ఈ సందర్భంగా ఎస్పీ వెంట తూప్రాన్ డియస్పి నరేందర్ గౌడ్, సిఐ లు వెంకట రాజా గౌడ్, సందీప్ రెడ్డి, ఎస్సై నారాయణ, సిబ్బంది, గ్రామ ప్రజలు ఉన్నారు.





# చేగుంటలో 'అర్రైవ్ అలైవ్' రోడ్డు భద్రతా అవగాహన సదస్సు, ఉచిత కంటి వైద్య శిబిరం

**చేగుంట మార్చి 31 మెదక్ టుడే న్యూస్**చేగుంట పోలీస్ స్టేషన్ ఆవరణలో మంగళవారం నాడు 'అర్రైవ్ అలైవ్' రోడ్డు భద్రతా కార్యక్రమంలో భాగంగా మూడవ విడత అవగాహన సదస్సు, ఉచిత కంటి వైద్య శిబిరాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో, లయన్స్ క్లబ్ ఆఫ్ చేగుంట, ఐశ్వర్య ఆప్టికల్స్ సహకారంతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల్లో 98% మానవ తప్పిదాల వల్లే జరుగుతున్నాయని, సెల్ ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల గతంలో మాసాయిపేట వద్ద జరిగిన రైలు ప్రమాదం వంటి చేదు జ్ఞాపకాలను గుర్తు చేస్తూ డ్రైవర్లను హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచిస్తూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తామని, తోటి ప్రయాణికుల భద్రతను గౌరవిస్తామని వారితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ క్రమంలో డ్రైవర్లకు దృష్టి లోపాలు ఉంటే ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, ఐశ్వర్య ఐ కేర్ వైద్య సిబ్బందితో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ళ అద్దాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు డీఎస్పీ, రామాయంపేట సీఐ, చేగుంట ఎస్.ఐ. చైతన్య కుమార్ రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షులు శంభుని శ్రీనివాస్, సెక్రెటరీ పులబోయిన నాగరాజు, ట్రెజరర్ నాగేశ్వర్, జోన్ చైర్ పర్సన్ ఏ. సుఖేందర్, క్లబ్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ ధ్యావ లింగమూర్తి, డిసి సిహెచ్ నరసింహులు, క్లబ్ సభ్యులు, పోలీస్ అధికారులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# చల్లపల్లి పీఎస్‌లో భారీ పేలుడు

**అమరావతి మార్చి 31**: కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్ స్టేషన్‌లో పెను ప్రమాదం సంభవించింది. బయటనుంచి తీసుకొచ్చిన మందుగుండు సామగ్రిని పోలీస్ స్టేషన్‌లో పరిశీలిస్తుండగా పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులు తీవ్రంగా గాయపడ్డారు.యపడిన వారిలో ఎస్సైతో పాటు ఇద్దరు కానిస్టేబుళ్లు, పోలీసు వాహన డ్రైవర్ ఉన్నారు. క్షతగాత్రులను వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పేలుడు ధాటికి పోలీస్ స్టేషన్‌లోని ఫర్నీచర్‌తో పాటు బయట పార్క్ చేసిన వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. ఈ పేలుడు గురించి తెలియగానే సీఐ కేఎస్ రావు ఘటనాస్థలికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు.

మెదక్ టుడే
తెలుగు దినపత్రిక
బుధవారం 01-04-2026

# చేగుంట వార్డ్ నెంబర్ ని పరామర్శించిన ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి.



**చేగుంట మార్చి 31 మెదక్ టుడే న్యూస్**చేగుంట పట్టణ ఒకటో వార్డ్ మెంబర్ మంచి కట్ల వంశీ కాలు ప్యాచర్ అయిన విషయం తెలుసుకొని పరామర్శించిన దుబ్బాక నియోజకవర్గం ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి. ఎమ్మెల్యే తో పాటు చేగుంట బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నారాయణ రెడ్డి, మాజీ జడ్పీటీసీ మొదం శ్రీనివాస్, మాజీ సర్పంచ్ ఫోరమ్ అధ్యక్షులు మంచికట్ల శ్రీనివాస్,బి ర్ స్ పార్టీ నాయకులు డాక్టర్ రమేష్,డిష్ రాజు,అకుల సుకెందర్, కాటికె రాజేష్,అల్లశీ శ్రీకాంత్ యాదవ్ , మహమ్మద్ అలీ, గుండ్ల సంపత్,తదితరులు పరామర్శించడం జరిగింది.

# సమస్యలు పట్టుదలతో పరిష్కరించడంలో విక్రమార్కుడే మా మంత్రి పొంగూరు నారాయణ

## జనసేన నేత గునుకుల కిషోర్

**నెల్లూరు మార్చి 31 :** బేతాళుని తీసుకురావడానికి విక్రమార్కుడు ఎంత



కష్టపడ్డాడో, నెల్లూరు సమస్యలను తీర్చేందుకు మున్సిపల్ శాఖ మంత్రి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యే పొంగూరు నారాయణ కూడా అంతే నిబద్ధతతో కృషి చేస్తున్నారు అని జన సేన నేత గునుకు ల కిషోర్ అన్నారు.ఒక షాప్ విజిట్ సందర్భంగా నెల్లూరు సిటీ గాంధీ బొమ్మ సెంటర్‌కు విచ్చేసిన మంత్రి వాటర్ పైప్‌లైన్ కోసం తవ్విన గుంతలు సరిగా పూడ్చకపోవడం వల్ల రోడ్ల దుస్థితిపై అధికారులను వివరణ కోరుతూ, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు.గాంధీ బొమ్మ నుండి దత్త సాయి మందిరం సందు వరకు గత డిసెంబర్ మొదటి వారంలో మినరల్ వాటర్ పైప్‌లైన్ పనుల కోసం తవ్విన గుంతలు మార్చి మధ్యవరకు కూడా పూడ్చకుండా వదిలివేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గతంలోనే జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల మంత్రి దృష్టికి తీసుకువెళ్లగా, 24 గంటల్లోనే గుంతలను పూడ్చి, పై భాగంలో సిమెంట్ వేసే చర్యలు తీసుకున్నారు.నేటి పర్యటనలో, రోడ్డు టాపరింగ్ సరిగా లేకపోవడం వల్ల కాలువల నీరు రోడ్లపైకి చేరుతున్న సమస్యను కూడా కిషోర్ మంత్రి కి వివరించగా, వెంటనే అధికారులను పిలిపించి పనితీరుపై ప్రశ్నించారు. రోడ్ల మరమ్మతులు సక్రమంగా చేపట్టి, వర్షపు నీరు నిల్వ ఉండకుండా డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచాలని ఆదేశించారు.ట్రంక్ రోడ్ గాంధీ బొమ్మ పరిసరాల వ్యాపారులు తక్షణ చర్యలు తీసుకున్నందుకు మంత్రి పొంగూరు నారాయణ కి కృతజ్ఞతలు తెలిపారు.విక్రమార్క--బేతాళ కథలలో చూపినట్లుగా న్యాయం, పట్టుదల, సత్యనిష్ఠతో సమస్యలను ఎదుర్కొంటూ, నెల్లూరు నగరాన్ని మోడల్ సిటీగా అభివృద్ధి చేయడానికి రాజధర్మంతో ముందుకు సాగుతున్న నాయకుడు పొంగూరు నారాయణ అని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల ప్రశంసించారు.

## ట్రాఫిక్ మళ్లింపు

**కడప, మార్చి 31:** బుధవారం 1వ తేదీన ఒంటిమిట్ట లో జరగనున్న శ్రీ సీతారాముల కళ్యాణం నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కడప నగరంలోని ఒంటిమిట్ట, రేణిగుంట రహదారిపై ట్రాఫిక్ మళ్లింపు అమలులో ఉంటుందని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు.ఈ నెల 1 వ తేదీ ఉదయం 9:00 నుంచి 2 వ తేది ఉదయం 8:00 గంటల వరకు అమలులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమ నిర్వహణ సందర్బంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా జాతీయ రహదారి-716 మీదుగా వచ్చు భారీ వాహనాలను రేణిగుంట, రాజంపేట, కడప వద్ద ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల ద్వారా జాతీయ రహదారి-716 మీదుగా కాకుండా ఇతర మార్గాలలో వెళ్ళాలని సూచించారు.బుధ,గురువారాలు దారి మళ్ళించడం జరుగుతుందని రాజంపేట వైపు నుండి వచ్చు ద్విచక్ర వాహనాలు, ఆర్.టి.సి. బస్సులు ఒంటిమిట్ట మండలం సాలాబాద్ క్రాస్ వద్ద సిద్ధవటం మండలం ఉప్పరపల్లి సాయిబాబా గుడి వద్ద దారి మళ్ళించడం జరుగుతుందని ఆయన తెలిపారు.కడప నుండి తిరుపతి వైపు వెళ్లే వాహనాలు కడప నగరం అలంఖాన్ పల్లి ఇర్కాన్ జంక్షన్ నుండి ఊటుకూరు సర్కిల్, రాయచోటి మీదుగా తిరుపతి వెళ్ళాలని చెప్పారు.

# కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**చేగుంట, మార్చి 31 మెదక్ టుడే న్యూస్**చేగుంట మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తూ, గతంలో ఆడపిల్ల పెళ్లి చేయాలంటే తల్లిదండ్రులు పడే ఇబ్బందులను గమనించి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ ఈ పథకాన్ని ప్రవేశపెట్టారని, ప్రస్తుతం ఉన్న ఈ ప్రభుత్వం కూడా దీనిని కొనసాగిస్తూ పేద కుటుంబాలకు అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, కొత్తగా ఎన్నికైన సర్పంచులు, వార్డు సభ్యులు పార్టీలకు అతీతంగా గ్రామ అభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం పని చేయాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా రైతులు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఇబ్బందులపై త్వరలోనే అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేసి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలోచేగుంట తహసీల్దార్ శివ ప్రసాద్ , నార్సింగి తహసీల్దార్ గ్రేసీ భాయి,ఎస్ ఐ చైతన్య కుమార్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ వెంగళరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఉప సర్పంచ్లు,ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.






# కన్నుల పండువగా సాగిన ఆంజనేయ స్వామి రథయాత్ర

**చేగుంట మార్చి 31 మెదక్ టుడే న్యూస్** చేగుంట మండలం, హనుమాన్ జయంతి వేడుకల సందర్భంగా మండల కేంద్రం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది. స్థానిక హనుమాన్ దేవాలయ ఆవరణలో శ్రీ కార్తవీర్య యోగాశ్రమం ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. మంగళవారం మధ్యాహ్నం ఆశ్రమ సభ్యుల సహకారంతో భక్తులకు అత్యంత క్రమశిక్షణతో అన్నదాన ప్రసాద వితరణ గావించారు. అనంతరం నిర్వహించిన హనుమాన్, శ్రీ రాముని విగ్రహాలతో శోభాయాత్ర అత్యంత వైభవంగా సాగింది. ఆంజనేయ స్వామి రథాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించి పురవీధుల్లో ఊరేగించగా, భక్తులు నీరాజనాలు పలికారు. ముఖ్యంగా యువత పెద్ద ఎత్తున పాల్గొని 'జై శ్రీరామ్', 'జై హనుమాన్' నినాదాలతో చేగుంట వీధులను హోరెత్తించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. హనుమంతుడు కేవలం భక్తికి మాత్రమే కాదు, క్రమశిక్షణ, నీతి, నిజాయితీ, శారీరక దారుఢ్యానికి చిహ్నమని పేర్కొన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలై కుటుంబాలను, దేశాన్ని ఇబ్బందుల్లోకి నెట్టకుండా, ఆంజనేయుడిని ఆదర్శంగా తీసుకుని బలిష్టమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భజరంగ్దల్ జిల్లా అధ్యక్షులు నాగరాజు, ప్రధాన కార్యదర్శి శ్యామ్, మండల అధ్యక్షులు సోమ సురేష్ భూపాల్ రెడ్డి,శ్రీ కార్తవీర్య యోగాశ్రమం అధ్యక్షులు కరణం గణేష్ రవికుమార్,సంతోష్,లక్ష్మణ్ రావ్,మనోహర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు సంద్రుగు సతీష్, ఉప సర్పంచ్ మహమ్మద్ రఫీక్,బీజేపీ మాజీ మండల అధ్యక్షులు చింతల భూపాల్, అయిత పరం జ్యోతి, వార్డు సభ్యులు సాయిబాబా, శ్రీరమణి శ్రీనివాస్, ఆరిఫ్, సుఖేందర్ తో పాటు ఆశ్రమ ప్రతినిధులు నాంపల్లి, భూపాల్ రెడ్డి, శంకర్, ఇతర సంఘాల కార్యకర్తలు, వేలాది మంది భక్తులు పాల్గొన్నారు.







# తిరుపతి అభివృద్ధిపై విషం చిమ్మడం ఆపాలి

## తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి....

**రేణిగుంట మన ద్యాస మార్చి 31.** తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్, తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి చంద్రగిరి శాసన సభ్యులు పులివర్తి నాని తో కలిసి ప్రెస్ మీట్ లో పాల్గొన్నారు .ఈ సందర్భంగా డాలర్స్ దివాకర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేసిన ఆరోపణలను తిప్పికొడుతూ: తిరుపతి అభివృద్ధి మరియు భూముల కేటాయింపుపై మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్రం, ముఖ్యంగా తిరుపతి ఎంతో వేగంగా అభివృద్ధి చెందుతోందని ఆయన పేర్కొన్నారు.ముఖ్యమంత్రి ఉదయం నుండి రాత్రి వరకు విశ్రాంతి లేకుండా రాష్ట్రాభివృద్ధి కోసం, పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ మరియు ఇతర కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని తెలిపారు.నారా లోకేష్ రాష్ట్ర అభివృద్ధి మరియు నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా విదేశీ పర్యటనలు చేస్తూ కంపెనీలను రాష్ట్రానికి రప్పించే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు.మాజీ ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి హోటల్స్ నిర్మాణానికి కేటాయించిన భూముల ధరలపై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని 21 ఎకరాల భూమిని ?1400 కోట్లకు అమ్మారనడం హాస్యాస్పదం.తిరుపతిలో ప్రస్తుతం ప్రైవేట్ భూముల ధరలే ఎకరాకు సుమారు ?250 కోట్లు పలుకుతున్నాయి. అటువంటప్పుడు ప్రభుత్వ నిబంధనల ప్రకారం పారదర్శకంగా జరుగుతున్న అభివృద్ధిని విమర్శించడం సరికాదు.తిరుపతికి వచ్చే భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోందని, ప్రస్తుతం



ఉన్న 800-850 స్టార్ హోటల్ గదులు ఏమాత్రం సరిపోవు కనుక భక్తుల సౌకర్యార్థం మరిన్ని అంతర్జాతీయ స్థాయి హోటల్స్ హయత్, మారియట్, నోవాటెల్ తిరుపతికి ఎంతో అవసరమని తెలిపారు, తద్వారా స్థానికంగా ఉపాధి పెరుగుతుందని వివరించారు. తిరుపతికి ప్రతిరోజూ సుమారు 1.5 లక్షల మంది భక్తులు వస్తుంటారని, వారందరికీ వసతి కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యం చేసిన రోడ్ల విస్తరణ (80 అడుగుల రోడ్లు), కోర్టు కాంప్లెక్స్ నిర్మాణం మరియు మాస్టర్ ప్లాన్ రోడ్లను తమ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తోందని,తిరుచానూరు పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా రోడ్లు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.నారా లోకేష్ పై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదని, కేవలం రాజకీయ లబ్ధి కోసం అభివృద్ధిని అడ్డుకోవద్దని కరుణాకర్ రెడ్డి ని హెచ్చరించారు. తిరుపతిని ఒక 'రౌడీయిజం సిటీ'గా కాకుండా ప్రశాంతమైన ఆధ్యాత్మిక నగరంగా ఉంచడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. చివరగా, వ్యక్తిగత విమర్శలు మాని, తిరుపతి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, లేనిపక్షంలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని దివాకర్ రెడ్డి గారు స్పష్టం చేశారు.

printed published and owned by CHILVERA SHIVAKUMAR and printed JWAALA PRINTERS H.NO.- 10-15/1/A, KUMMARI GAINI,MANDAL PAPANNAPETA, DISTRICT, MEDAK, TELANGANA- 502303- Gmail. medaktoday94@gmail.com,Editor: CHILVERA SHIVAKUMAR. RNI NO, TELTEL 2023 ,88524, 9948265095.9494117870..